క్లుప్తంగా

శ్మశానానికి దారి కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్త పాళెంలో శ్మశానానికి దారి లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శ్మశానం గ్రామానికి రెండు కిలోమీటరు దూరంలో ఉండడంతో శవాన్ని తీసుకుపోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. శ్మశానం పంట పొలాల మధ్యలో ఉండడంతో శవాలను పొలాల్లో మోసుకుపోలేక పోతున్నారు. శ్మశానానికి గతంలో దారి ఉండేదని, ఇప్పుడు ఆ దారిని కొందరు ఆక్రమించుకోవడంతో ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ సుబ్బరత్నమ్మ తెలిపారు. శ్మశానానికి దారి వసతి కల్పించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోతున్నారు.

టైలర్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

శ్రీకాళహస్తి: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న టైలర్ బ్రహ్మయ్య ఆచారికి దాతల సాయంతో సేకరించిన నగదును పోలూరు శ్రీనివాసులురెడ్డి శుక్రవారం అందజేశారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్న టైలర్ బ్రహ్మయ్య ఆచారి గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధిలో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం చెందిన బ్రహ్మయ్యకు సాయం చేయాలని టీడీపీ నాయకుడు, టైలర్ పోలూరు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్సను అందించేలా చొరవ చూపారు. కాగా దాతల సాయంతో సేకరించిన రూ.12,600ను శుక్రవారం బ్రహ్మయ్య ఆచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టైలర్ సంఘం నాయకులు మౌలాలీ, రాంబత్తెయ్య, చెంగయ్య, రమేష్, మణి, యతిరాజులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఆధునీకరణ పనులు చేపట్టాలి



పార్కులో పిచ్చిమొక్కల మధ్య కళావిహీనంగా ఉన్న విగ్రహం

సత్యవేడు: నియోజక వర్గ కేంద్రంలో కళావిహీనంగా ఉన్న పార్కును తుడా నిధులతో ఆధునీకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తుడా అధికారులను కోరారు. శుక్రవారం మధ్యాహ్నం తుడా వైస్ చైర్మన్ వెంకటనారాయణతో కలసి ఆయన పిచ్చిమొక్కలతో నిండిన పార్కును సందర్శించారు. 2018లో అప్పటి సర్పంచ్ డి. పద్మావతి సుమారు రూ.2లక్షల వ్యయంతో నిర్మించిన పార్కు కళావిహీనంగా మారిన విషయంపై ఎమ్మెల్యే స్పందించారు. దీంతో పార్కును పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా ఆధునీకరించాలని ఎమ్మెల్యే తుడా అధికారులను కోరారు. పార్కు స్థలాన్ని సర్వే చేయాలని కోరారు. ఆహ్లాదకరంగా పార్కును ఆధునీకరిస్తామని తుడ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ చంద్రశేఖర్ సర్వేయర్ గౌరి, స్థానికులు హేమభూషణం,బీబీఎస్ రెడ్డి, ప్రభాకర్, అరుళ్, రాధాకృష్ణ, బాలమురళికృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంజూరుకు సన్మానం



అంజూరు శ్రీనివాసులను సన్మానిస్తున్న బలిజ సంఘం నేతలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను బలిజ సంఘాల నేతలు శుక్రవారం సన్మానించారు. నగరి, పుత్తూరు బలిజసంఘాల ఆహ్వానం మేరకు శుక్రవారం అంజూరు తారక శ్రీనివాసులు బలిజ సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని వారు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, గోపిరాయల్, శివయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


పచ్చాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో పచ్చాలమ్మ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పల్లమాలలోని పచ్చాలమ్మ దేవతకు శ్రావణ శుక్రవారం కావడంతో గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పచ్చాలమ్మ దేవతకు విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కొల్లగొట్టు.. సిరులు పట్టు





మట్టి తరలింపుతో బావులను తలపిస్తున్న గోతులు

కొందరు స్వార్థపరులు ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు. అక్రమం వారి ఇష్టారాజ్యంగా మారింది. ఇటీవల ఎన్నికలు.. అధికారులు బదిలీలు.. ప్రభుత్వాల మార్పులు తదితర తతంగాలతో అడిగే నాథులే కరువయ్యారు. దీనికితోడు సత్యవేడు మండలంలోని కాదిరివేడు, మదనంజేరి గ్రామాలకు తమిళనాడు సరిహద్దులో ఉండడం అక్రమార్కులకు వరంగా మారింది. మట్టి, గ్రావెల్ బంగారంగా మారడంతో అక్రమార్కులు ఇక్కడి నుంచి మట్టిని యథేచ్ఛగా తరలించి, రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అధికారులు ఇప్పటికైన పట్టించుకోకుంటే పర్యావరణానికి ముప్పు తప్పదు.

- సరిహద్దులో మట్టి మాఫియా
- యథేచ్ఛగా తమిళనాడుకు మట్టి తరలింపు
- తమిళ మట్టి మాఫియా స్థానిక నేతలకు ఎర
- పట్టించుకోకుంటే పర్యావరణానికి ముప్పు

సత్యవేడు: ఆంధ్రా–తమిళనాడు సరిహద్దులోని సత్యవేడు మండలం నుంచి గ్రావెల్ భారీగా తమిళనాడుకు తరలుతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు బదిలీలు జరుగుతుండడంతో ఇదే అదునుగా రేయింబవళ్లు మట్టి, గ్రావెల్ తమిళనాడుకు తరలిస్తూ మట్టి మాఫియా రూ.కోట్లు దండుకొంటోంది. మరో వైపు ప్రభుత్వ మేతబీడు భూములు ఎంపిక చేసుకుని మట్టిని తవ్వేస్తున్నారు. రోజుకు రూ.10 లక్షలు విలువజేసే మట్టిని సరిహద్దు దాటిస్తున్నారు. సత్యవేడు మండలంలోని కాదిరివేడు, మదనంజేరి నుంచి తమిళనాడుకు ఎర్రమట్టి(గ్రావెల్) యథేచ్ఛగా తరులుతోంది. తమిళనాడులో చెన్నై నేషనల్ హైవే పనులు, పట్టణ ఆధునీకరణ, లోతట్టు ప్రాంతాలు ఎత్తు చేయడం, భారీ వంతెనలు, రోడ్డు విస్తరణ వంటి పనులకు అక్కడి కాంట్రాక్టర్లు సత్యవేడు నుంచి మట్టి తరలిస్తున్నారు. తమిళనాడులో మట్టి తవ్వకాలకు అక్కడి ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోంది. దీంతో మట్టి అవసరం ఉన్న కాంట్రాక్టర్లు , అక్రమార్కులు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు మండలం వైపు కన్నేశారు. ఆంధ్రా–చెన్నై సరిహద్దులోని మండలంలో అధికార పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని మట్టిని తరలిస్తున్నారు. తొలుత తెలుగు గంగ కాలువ మట్టిపై కన్నేశారు. మైనింగ్ అధికారులతో స్థానికుల పేర్లతో అనుమతి తీసుకుని వారికి కమీషన్లు ముట్ట జెప్పి తమ పని సులువుగా చేసుకునేవారు. కొన్ని ప్రాంతాల్లో గంగ కాలువ మట్టి నాణ్యతగా లేదు. బంకమట్టిని తరలించడంతో చెన్నై ఇంజినీర్లు నాణ్యత లేదని తిరస్కరించారు. దీంతో నాణ్యమైన మట్టి కోసం గ్రామాలు అన్వేషించి, ఆంధ్రా– తమిళనాడు సరిహద్దులోని కాదిరివేడు, మదనంజేరి గ్రామాలను ఎంపిక చేసుకున్నారు.

మేత బీడు భూముల్లో మట్టి స్వాహా

సత్యవేడు మండలంలోని కాదిరివేడులో 93 సరే నంబర్‌లో 98.30 ఎకరాలు మేత బీడు భూముల ఉన్నాయి. అలాగే మదనంజేరిలో 186–లో 20.4 ఎకరాలు, 186–1లో 2.3 ఎకరాలు మేత బీడు భూమి ఉంది. సమీపంలోని తమిళనాడు భూములున్నాయి. తమిళనాడుకు చెందిన మట్టి మాఫియా పగలు తమిళనాడులో మటి సేకరిస్తూ, రాత్రివేళ్లలో అనుమతి లేని ఆంధ్రాలోని మేతబీడు భూముల్లో జేసీబీల ద్వారా మట్టి సేకరించి టిప్పర్లలో తమిళనాడుకు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో తమిళనాడుకు మట్టి(గ్రావెల్) తరలిపోతోంది.

ఉపాధి పనులకు.. పశువుల మేతకు ఇబ్బందే

పంచాయతీ పరిధిలో మేతబీడు స్థలంలో ఉపాధి పనులు చేపడుతున్నారు. మట్టి మాఫియా బావులను తలపించేలా గోతులు తీస్తుండడంతో ఉపాధి పనులకు స్థలాలు కొరత ఏర్పడుతోంది. అక్రమార్కులు మేతబీడు భూముల్లో గుంతలు తీస్తుండడంతో పశువులకు మేత లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసువులు మేతకు దూరప్రాంతాలు పోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

పశువుల మేతకు ఇబ్బందిగా ఉంది



గ్రామంలో రైతులు వ్యవసాయం చేస్తాం. పాడి పశువులు, మేకలు, గొర్రెలు మేపుకుని జీవిస్తున్నాం. గ్రామం పరిధిలో మేత బీడు భూమి ఉంది. మా తాతల కాలం నుంచి పశువులను మేత బీడు భూముల్లో మేపుతున్నాం. ప్రస్తుతం మేత బీడు భూముల్లో మట్టి కోసం గోతులు తీసున్నారు. పశువులకు గడ్డి లేకుండా పోతోంది. అధికారులు మేత బీడు భూమిని ఆక్రమణ కాకుండా చూడాలి.

–యుగంధర్, కాదిరివేడు, సత్యవేడు మండలం

అక్రమాలు అరికడతాం



తహసీల్దార్‌గా నేను కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. కాదిరివేడు, మదనంజేరిలలోని మేత బీడు భూమిలో మట్టి తరలింపు విషయం నా దృష్టికి రాలేదు. వీఆర్‌ఏ, వీఆర్వోల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకుని అక్రమాలు అరికట్టేందుకు చర్యలు తీసుకొంటాం.

– టీవీ సుబ్రమణ్యం, తహసీల్దార్, సత్యవేడు

యథేచ్ఛగా మట్టి దోపిడీ

- టీడీపీ నాయకుల దందా

ఏర్పేడు: టీడీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చలవిడిగా మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. అక్రమంగా మట్టిని ట్రాక్టర్‌ల ద్వారా తరలించి రూ.లక్షలు గడిస్తున్న సంఘటన శుక్రవారం మండలంలోని మేర్లపాకలో చోటుచేసుకుంది. మేర్లపాక గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గత వారం రోజులుగా చెరువులో రెండు జేసీబీలతో మట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఏర్పేడులో నూతనంగా నిర్మిస్తున్న భవనాలు, దుకాణాలు, ఇళ్ల స్థలాలు, చుట్టు పక్కల వెంచర్లకు తరలించి, రూ.లక్షలు గడిస్తున్నారు. వారం రోజలుగా చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారని ఆయకట్టు రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చెరువు నుంచి మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఫోన్‌లో మేర్లపాక వీఆర్వో ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా గ్రామస్తుల నుంచి శుక్రవారం వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పనులు ఆ పామన్నారు. అక్రమంగా చెరువు నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు.



మేర్లపాక చెరువులో ట్రాక్టర్‌కు మట్టి నింపుతున్న జేసీబీ





మేత బీడులో మట్టి (గ్రావెల్) తరలింపుతో ఏర్పడిన గోతులు, మట్టి తరలిస్తున్న మేతబీడు భూమి సమీపంలో చేపట్టిన ఉపాధి పనులు

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారికి సాదర స్వాగతం



వివేక్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి వివేక్‌యాదవ్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు.

వైభవంగా అర్జున తపస్మాన్



పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీసమేత ధర్మరాజులస్వామి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేనేత సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అర్జున తపస్మాన్ వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలు, విశేషపూజలు చేశారు. తపస్మాన్ వద్ద సంతానప్రాప్తి కోసం మహిళలు తడిదుస్తులతో వరబడ్డారు. అర్జున వేషధారి పద్యాలు, పాటలు ఆలపిస్తూ తపస్మాన్ ఎక్కాడు. తపస్మాన్ పైభాగంలోకి వెళ్లిన అనంతరం తమ వెంట తీసుకుని వెళ్లిన నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, విభూది తదితర సామగ్రికి పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, విభూదిని తపస్మాన్ పై నుంచి భక్తులపైకి చల్లారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్తరగోగ్రహణం నాటకంలో అర్జున పాత్రదారి ఆవుల మళ్లింపు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి కీచకవధ వీదినాటకం ప్రదర్శించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు.

అలరించిన 'పాండవ జననం'



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీదేవి

రామచంద్రాపురం: ఎస్‌ఆర్ కమ్మపల్లె సమీపంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో సాగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భాగవతారిణి సీతాలక్ష్మీ ఆలపించిన పాండవులు, కౌరవుల జననం హరికథ అలరించింది. అనంతరం మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఆర్ కమ్మపల్లెకు చెందిన దినకర్ నాయుడు కుటుంబసభ్యులు అన్నదాన వితరణ చేశారు. ఈ క్రమంలోనే ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే సి.రామాపురంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా సుభద్ర కల్యాణోత్సవం జరిపించారు. వల్లేటి బాబురెడ్డి కుటుంబసభ్యులు అన్నదానం చేపట్టారు.

అధునాతన వ్యవసాయంతో అధిక లాభాలు



రైతులకు కోడిపిల్లలను పంపిణీ చేస్తున్న కేవీకే చైర్మన్ వెంకటరత్నం

- ముగిసిన కేవీకే స్వర్ణోత్సవాలు

రేణిగుంట: అధునాతన వ్యవసాయ విధానంతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటరత్నం అన్నారు. మండలంలోని కరకంబాడి వనస్థలి కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న కేవీకే స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం రాస్ ప్రధాన కార్యదర్శి, కేవీకే చైర్మన్ ఎస్.వెంకటరత్నం, తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకులు వి.సుమతీ, రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు గోల్డెన్ టార్చ్ ర్యాలీ నిర్వహించి, వివిధ ప్రదర్శన క్షేత్రాలను చూపి, పంటలకు పురుగుమందులు డ్రోన్‌తో పిచికారీపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంతో చేయాలని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు నూతన సాంకేతికత, వంగడాలను సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ యువత వ్యవసాయం వైపు మొగ్గు చూపి, ఇతర రైతులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డా.వి.సుమతి మాట్లాడుతూ రాస్ కేవీకే 32 సంవత్సరాలుగా జిల్లాలో రైతుల ఆదాయం పెంచడానికి వరిలో డ్రమ్‌సీడర్ పద్ధతి, వరి నాటే యంత్రాలు, వివిధ ఆహార, ఉద్యాన పంటల్లో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాల ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అలాగే వ్యవసాయంలో సాగు ఖర్చు తగ్గించడంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కేవీకే వారు రూపొందించిన ప్రచురణలను విడుదల చేసి ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం రైతులకు వనరాజ కోడిపిల్లలు, మొబైల్ అజోల్ల యూనిట్స్, సంపంగి విత్తనం, మామిడి రైతులకు ఎరువులు, మల్బరీ రైతులకు రూమ్ హీటర్స్, జీవ సంబంధిత ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాము కుమార్, అనుషా పలు మండలాలకు చెందిన 125 మంది రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు గాజుల అలంకరణ



శ్రీకాళహస్తి: పపట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న ముత్యాలమ్మకు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గాజుల అలంకారం చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారికి గాజుల అలంకరణ చేయగా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

గాజుల అలంకారంలో ముత్యాలమ్మ

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

శ్రీకాళహస్తి: పట్టణంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్వర్ణముఖి నది వద్ద ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.



సర్దార్ గౌతు లచ్చనకు నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

శ్రీకాళహస్తిలో వాజ్‌పేయి వర్ధంతి



వాజ్‌పేయ్‌కు నివాళులర్పిస్తున్న లక్ష్మణ్ తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద శుక్రవారం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాదిగా, నిస్వార్థ నేతగా, రాజకీయ విలువల కలిగిన నాయకుల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి ముఖ్యడన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, కండ్రిగ ఉమ, ఎస్వీ రమణ, గరికపాటి రమేష్‌బాబు, ఉమాసింగ్, వాసుయాదవ్, డిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

సత్యవేడు: మండలంలోని దేవాలయాలు, ఇళ్ల వద్ద మహిళలు శుక్రవారం వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం కుటుంబసమేతంగా దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సత్యవేడులోని వీరభద్రస్వామి ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో దేవతామూర్తులను ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతం, లలితసహస్రనామ పారాయణం, అష్టలక్ష్మీ పూజలు, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీరోడ్డులోని లలితాదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు. నూతదంపతులు, మహిళలు, చిన్నారులు సైతం ఎంతో నియమ నిష్టలతో అమ్మవార్లకు పూజలు జరిపారు. అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్, మల్లికార్జున తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని, వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామిని విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



సత్యవేడు: వెంకన్న సన్నిధిలో సామూహిక వరలక్ష్మీవ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ప్రసన్నవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులకు పులిహోర, దద్దోదనం, పంచామృతం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

నారాయణవనం: మండలంలో వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం పద్మావతీ అమ్మవారిని అంతర ప్రాకారంలో ఊరేగించి, ఊంజల్ సేవను నిర్వహించారు. సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. 7 గంటలకు కల్యాణ వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పద్మావతీ అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి, దూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం విశేషాలంకరణలో పద్మావతీ అమ్మవారు పద్మంపై అధిష్టించి ఆలయ అంతరప్రాకారంలో ఊరేగి, ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. స్థానిక వీరరాఘవ దేవస్థానంలో ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ పాలవర్గం ఏర్పాటు చేసింది. సముదాయంలోని అవనాక్షమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతం సందర్భంగా మహిళలు పిండి దీపాలను వెలిగించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జిత అధికారి భరత్ పాల్గొన్నారు.



నారాయణవనం: ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు





సత్యవేడు: వీరభద్రస్వామి ఆలయంలో వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు, బుచ్చినాయుడుకండ్రిగలో..